# బంగ్లయ్యకు గుడ్ - లక్ !

**కవికొండల వెంకటరావు**

లార్డు లివియథాన్ ఇంగ్లీషుమాన్. లివియాథాన్ ప్రభ్వికూడా ఆ దేశానకు చెందిన మనిషే. వాళ్ళ పిల్లలందఱూ కూడా ఆ దేశంలో జన్మించినవారే "కన్సెషెన్" ఏ దేశంలో కానీయండి.

లివియథాన్ కుటుంబంవారి చాయ ఉడుకున్నంలో పైకె తిన దూఱిపింజెల చాయ నొప్పుతూ, లోపలి వెచ్చని నెత్తురుయొక్క కావి అవి బూరిబుగ్గల్ని బుసకొట్టేలా, బొద్దుదేటి అద్దుకాగితాలాంటి దళాసరి చర్మంతో వెలిసివుంటుంది. ఇండియా దేశపు వేడిమి తట్టుకోలేక ముహుర్ముహుర్ఘర్మవారి నేరులు కట్టుకుంటూ "సీలింగు ఫానుల" క్రింద కూర్చుండి "ది ఫ్రెజిడేర్ కూలింగు ప్రిసెర్వ్‌డ్ ఫ్రుట్స్" ఫలాహారంగా ఆహారిస్తూ, వారున్నారు ఈ కథాకాలం నాటికి.

లివియథాన్ ప్రభువుదగ్గ వుండే బట్లేరు పేరు బంగ్లయ్య. బంగ్లయ్య. పక్కా నేటివ్, అవుగాక! చిన్నప్పుడే మరి ముచ్చటకు, మాచూచి మాచూచి ముట్టుకొన్నట్టుగా, 'వ్రా'చేసి 'వ్రా'చేసి కట్టుకున్నాడు అనుతాపి అనే ఒక బిబ్లికల్ మహాపాపిని.

బిబ్లికల్ పాపి అంటే ఏడమ్ అండ్ ఈవ్ దంపతుల ప్రణయఫలితంగా పరిణమించిన పరంపర పాపజన్మ అన్నమాట. అంతే. అంతకంటె వేఱే పాపం చేసింది లేదు ఆ యిల్లాలు.

ఆ నేటివ్ క్రిస్టియన్ దంపతులిద్దరూ, ఒకరు నల్లతుమ్మ కాల్చగా వచ్చిన బొగ్గు చాయకుంటే, ఒకరు సింగరేణిగనులనుండి వెలిబుచ్చిన రాక్షసి బొగ్గుచాయకుండేనారేగాని ఒకర్నొకరు తీసిపోయేవారు ఏమాత్రం కారు. మఱేన్నీ వారిపిల్లలు డజను మంది. డజనుమందిని వరుసగా పరుండబెడితే వాల్చిన బ్లాక్‌బోర్డు అని అనుకొని తీరాలి.

కాని ఎప్పుడున్నూ బంగ్లయ్య బాపతు ప్రజాసమూహం లివియథాన్ దంపతులు కంటబడింది లేదు. వీళ్ళ ఉనికి ఊరుపట్టుపీడు విశ్రాంతి పొడుపేటు. బంగ్లయ్య వొక్కడే బట్లేరు. ఏ గూడో వో రూపాన్ని నిత్యం లివియథాన్ దంపతులింట ప్రత్యక్షమయివుండేవాడుకూడా అతడొక్కడే!

కాని రోజులైనా సరే, కరువురోజులైనా సరె, కర్మకాండ తప్పదు గదా! 25-1 -? క్రిస్మస్ పండగ వచ్చింది. అదివఱకల్లా బంగ్లయ్య వొక్కడే దొరగారికి, వారి కుటుంబానికి చెప్తూవుండేవాడు "సంతోషకరమైన కిసిమిసి" ఆ సంవత్సరం పిల్లల్ని పెళ్ళాన్ని కూడా తీసుకువెళ్ళి దొరగారికి, దొరగారి భార్యకు, వారి పిల్లలకు తాను కుటుంబ సమేతంగా "సంతోషకరమైన కిసిమిసి" చెబ్దామని సంకల్పించుకున్నవాడై, రెండు దండలూ, ఓబిస్కట్లు డబ్బా పట్టుకు బయలుదేఱాడు, తెల్లాటి ఎనిమిద్దికే ఆ పొద్దు బంగ్లయ్య.

డజను మంది నేటివ్ పిల్లలూ, బంగ్లయ్యా, బంగ్లయ్య భార్య అనుతాపి బజారంటే నడుస్తూ క్రమక్రమంగా లివియథాన్ దొరగారి బంగాళా గుమ్మం చేరుకునేలో, వారి వెనకాల, ఎఱ్ఱటివోళ్ళు, పచ్చటివోళ్ళు, చామనచాయవోళ్ళు, ఓమోస్తరు నల్లనివోళ్ళు, ఏ చాయాలేని వోళ్ళు, ఎంత తోమినా రానివోళ్ళు, హిందువులూ, ముస్లి

మేలూ, వీరందఱూ, ఎంత లేదన్నా, ఓ వంద మంది వెంటాడించారు.

"వీరందర్నీ ఎలా పోషిస్తున్నాడు? ఈ బంగ్లయ్య ఈ రోజుల్లో" అని ఆశ్చర్య పోసాగినారు.

"పోషణ ఖర్చుకే— దొరగారి దర్శనార్థం తీసికెడుతూ వున్నాను" అన్నాడు అతి జాలిగా బంగ్లయ్య ప్రక్క ప్రక్కనున్న జనంతో. "దొరగారెంత దొడ్డోరైనా ఇంతమందిని పోషించుకునే మాత్రం చూపిస్తారా ఈ వెఱ్ఱిమొహానికి" అని కనిపెట్టి చూస్తూవున్నారు ప్రజానీకం. అనుతాపి ఎవరి వంకా చూడకుండా తన బిడ్డలవంక తనవంక నేలవంక చూసుకుంటూ నడుస్తూవుంది.

చేరుకున్నారు నగుమొగాల్తో లార్డు లివియథాన్ గారి బంగాళా!

లార్డు లివియథాన్ వచ్చి, బంగ్లయ్య దంపతులు వేసిన పూలదండల సువాసన మెచ్చుకుంటూ, "బ్లాక్‌మార్కెట్టును పెంపొందింపజేస్తూ వున్నది మీ కుటుంబమేఅనుకుంటాను బంగ్లయ్యా!" అని అభినందించాడు. వెంటనే బంగ్లయ్య మగనాలి "మా వల్లను ఏమవుతుందండి! దొరగారూ! బియ్యం తెలుపు బిన్నిబట్ట తెలుపు, డఫ్ తెలుపు, పౌడరు తెలుపు! ఎంత నల్లటివాళ్లో కప్పెట్టినా ఎంత నల్లటి గుప్పిట్లో కుదించినా, తెలుపురంగు బయటపడి తీరుద్ది దొరగారూ! మా నల్లనోళ్లవల్ల ఏమవుద్ది దొరగారూ! ఏదన్నా తమవరే! తెల్లదొరలకే సెల్లు తమకు మా సలాములు!" అంది వొయ్యారంగా.

ఎంతమందిని కన్నా అనుతాపి వొయ్యారం అదేమిటో అలాగే ఒల్చివుంది "షేప్సు" తోలా 'ఫోటైన్సు' ఇప్పుడున్నా.

లార్డు లివియథాన్ అతి టిప్‌టోగా "మేం ఈ రోజునే క్విట్ ఇండియా కావిస్తున్నాం. మీకు తెలియదు కాబోలు.

ఎప్పుడో అన్నాది.

ఈ నాడే నెరవేరుస్తున్నాం.

మీకు తావిస్తున్నాం. ఈలా ఆడవాళ్ళదగ్గర్నుంచి వైదొలగమంటూ వున్నప్పుడు, మరి వుండడం మాకు మంచిదికాదు. సామాను ప్యాక్ చేశేశాం. ఈ తత్క్షణం 'క్విట్ ఇండియా' పంథామేం మా కుటుంబం అమలుపెట్టేసి వేస్తున్నాం. "ఎ హేపీ క్రిస్టమస్ టుయు ఆల్!" అన్నాడు పెద్దనవ్వు నవ్వుతూ!

అనుతాపికి కళ్లు చెమ్మగిల్లాయి, బంగ్లయ్య లివియథాన్ పాదం ముట్టాడు. బాంగ్లీయులు మాత్రం "మీరు వెళ్ళిపోతే ఈ బంగళాలో మాం ప్రవేశిస్తున్నాం!" అన్నారు సగర్వంగా.

"ఉండుండి! సత్వరం ప్రవేశించి వుండుండి! మీ క్షేమంకోరకే మేం వెళ్ళిపోతున్నది" అని లివియథాన్ ప్రభువు ఒక తాళంచెవి ఆ పిల్లల కందించాడు.

ఆ తాళంచెవి తెల్లగా వుంది. "వెండి చెవిలాగుంది." అంది అనుతాపి వోరచూపు చూస్తూ. బంగ్లయ్య "దానిమీద క్రెసెంట్ చెక్కబడి వుంది" అన్నాడు దూరపుజూపు ప్రకటిస్తూ. పిల్లలు తాళంచెవి పెట్టి తలుపులు తియ్యబోతే తలుపులు రావు. లోపల కిచకిచలు. తలుపుల సందులంట చూచేరు. లోపల కృష్ణగద్దల సంతానం. జీసస్ లేదు మోసెస్ లేదు.

అప్పటికప్పుడే లివియథాన్ ప్రభువు ప్రభ్వితో వారి ప్రోజెనీతో అందరూ బోంబేమెయిల్ ఎక్కేసి—చల్! చల్! చల్! స్టీమర్ డెక్ మీద తొక్కేసి టక్! టక్! టక్! మరిన్ని దేవుడు మేలుచేస్తే లండన్‌నుండి బంగ్లయ్యకు కేబిల్—గుడ్ లక్! లక్! లక్!

---

## రోగాల్ని తెచ్చిపెట్టే 8 - ఔన్సుల రేషన్

ధాన్యసేకరణ విషయంలో చేయగలిగింది లేక, మన మద్రాసు ప్రభుత్వం బియ్యం రేషను 8 ఔన్సులకు తగ్గించివేశారు. ఈ తగ్గింపువల్ల ప్రజానీకానికి చెప్పరాని వ్యాధులెన్నో సంక్రమించి ప్రబలుతున్నాయి. ప్రజారోగ్యం భగ్నమై పోతున్నది. ఈ విషయాన్ని వైద్యశాస్త్రరీత్యా సవిస్తరంగా విశదీకరిస్తూ బెజవాడలోని డా॥ ప్రకాశచంద్రశతపథిగారు ఒక బహిరంగ నివేదికను ప్రధాని ఓమందూరువారికి సమర్పించారు. దీన్ని అందరూ అవలోకించడం మేలు.